క్లుప్తంగా

ప్రజలకు మంత్రి రాజా ఉగాది శుభాకాంక్షలు

తుని: తెలుగు నూతన సంవత్సరంలో ప్రజలు సంతోషంగా ఉండాలని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆకాంక్షించారు. మంగళవారం ఉగాది వేడుకలను పురస్కరించుకొని ప్రజలకు ఆయన సోమవారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆయన కోరారు.

వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం



రత్నగిరిపై అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: అమావాస్య సందర్భంగా రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి సోమవారం ప్రత్యంగిర హోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు పంపిణీ చేశారు. వేద పండితులు యనమండ్ర శర్మ ఘనపాఠి, ప్రయాగ రాంబాబు, కోట వంశీ, ఫణిశర్మ, దేవులపల్లి ప్రకాష్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం జరిపారు.

20 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

నేడు శంకర్‌మల్లిక్ పర్యటన

కోటనందూరు: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు శంకర్‌మల్లిక్ మంగళవారం మండలంలోని ఇండుగపల్లిలో పర్యటిస్తారని ఎంపీపీ లగుడు శ్రీనివాసు సోమవారం తెలిపారు. సాయంత్రం 4.30 గంటలకు ఇండుగపల్లిలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఆస్తిపన్నుపై రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

తుని: పురపాలక సంఘానికి చెల్లించాల్సిన ఆస్తిపన్నుపై ప్రభుత్వం ఇస్తున్న రాయితీని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకట్రావు కోరారు. స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో 2024–25కు సంబంధించి ఆస్తిపన్నుపై 5 శాతం రాయితీ ఇస్తూ సోమవారం ఈఆర్పీ లాగిన్ ఇచ్చారన్నారు. విషయం తెలుసుకున్న పాండురంగా ప్రజా వైద్యశాల యాజమాన్యం ఆసుపత్రికి సంబంధించి 9 అసెస్మెంట్లకు గాను రూ.2,33,471 చెల్లించారన్నారు. ఇందుకు సంబంధించిన ధ్రువపత్రాన్ని కమిషనర్ వెంకట్రావు సదరు యజమానికి అందజేశారు. తుని పట్టణానికి చెందిన యజమానులు సకాలంలో ఆస్తి పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

పేదల ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించండి



పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న వరుపుల సుబ్బారావు, ఎమ్మెల్సీ అనంతబాబు



పేరవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వరుపుల సుబ్బారావు

- వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు
- పెద్దిపాలెంలో ఎమ్మెల్సీ అనంతబాబుతో కలిసి ఎన్నికల ప్రచారం

ప్రత్తిపాడు రూరల్: పేదలకు, పెత్తందారులకు మధ్య జరిగే ఎన్నికల సంగ్రామంలో ప్రజలు పేదల పక్షపాతి అయిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పక్షాన నిలవాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని పెద్దిపాలెంలో ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్ (అనంతబాబు)తో కలిసి సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత ఐదేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ప్రభుత్వానికి ప్రజల్లో రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందన్నారు. కుల మతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.

వైఎస్సార్ సీపీలో 50 కుటుంబాలు చేరిక

మండలంలోని పెద్దిపాలెం గ్రామానికి చెందిన 50 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారికి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు, ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నైనుపు గోవింద్, నైనుపు నాగరాజు, కండిపల్లి ప్రసాద్, కండిపల్లి నాని, రీసు వీరస్వామి, రీసు అప్పలరాజు, రీసు అర్జునుడు, కండిపల్లి రమణబాబు, కండిపల్లి వీరబాబు, సిమ్మ సూరిబాబు, మాదిగబోయిన కామరాజు, పిల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం

ఏలేశ్వరం: రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే వచ్చే ఎన్నికల్లో మరోసారి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కట్టాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ అన్నారు. మండలంలోని పేరవరంలో సోమవారం వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్నికుట్రలు పన్నినా వైఎస్సార్ సీపీ విజయాన్ని ఆపలేరన్నారు. ప్రజల మద్దతు ఉన్న సీఎం జగన్ మళ్లీ గద్దె నెక్కడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అడపా పార్థసారథి, బేరి అరవిందకుమార్, నాగులపల్లి బాబ్జీ, బొడ్డు సూరిబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథికి పట్టం కట్టండి

- వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం సతీమణి వాణి
- యల్లమిల్లిలో ఎన్నికల ప్రచారం



యల్లమిల్లిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న తోట వాణి

గండేపల్లి: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో మరోసారి ప్రజలు పట్టం కట్టాలని వైఎస్సార్ సీపీ జగ్గంపేట అభ్యర్థి తోట నరసింహం సతీమణి వాణి అన్నారు. మండలంలోని యల్లమిల్లిలో సోమవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, పార్టీ మండల అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఒబిణ్ని వీరబాబు, బొర్రంపాలెం, సుబ్బయమ్మపేట సర్పంచులు పోకల సుబ్బు, బొబ్బర శివ, డీసీఎంఎస్ మాజీ డైరక్టర్ రామకుర్తి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో గెలుపు తథ్యం

- వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం తనయుడు తోట రాంజీ
- బూరుగుపూడిలో ఎన్నికల ప్రచారం



బూరుగుపూడిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న తోట రాంజీ

కిర్లంపూడి: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యమని ఆ పార్టీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం తనయుడు తోట రాంజీ అన్నారు. మండలంలోని బూరుగుపూడిలో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నేత పాఠంశెట్టి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో స్థానిక నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి జగ్గంపేట ఎమ్మెల్యేగా తోట నరసింహాన్ని, కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల ఇన్‌చార్జి తోట బాబ్జీ, వైస్ ఎంపీపీ పాఠంశెట్టి సత్యవతి, సర్పంచ్ అశపు రామలక్ష్మి, అశపు బద్రి, కర్రి నారాయణమూర్తి, పిన్నం గొల్లయ్య, కర్రి సుబ్రహ్మణ్యం, జగ్గమహంతి శ్రీను, కుందలమహంతి వెంకటరమణ పాల్గొన్నారు.

ముగిసిన పాదయాత్ర

అన్నవరం: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుతూ జెడ్డంగి అన్నవరం నుంచి రత్నగిరిపై సత్యదేవుని సన్నిధికి వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ లీగల్ సెల్ ఇంచార్జి నాగేంద్ర రాజు పలివెల, కాకరపల్లి లోవదుర్గ చేపట్టిన పాదయాత్ర ముగిసింది. మూడు రోజుల క్రితం పాదయాత్ర ప్రారంభించిన వారు సోమవారం రత్నగిరిపై యాత్రను ముగించి సత్యదేవుని దర్శించారు. అన్నవరంలో వీరికి స్థానిక ఉపసర్పంచ్ బొబ్బిలి వెంకన్న, వైఎస్సార్ సీపీ నాయకులు దడాల సతీష్, కొండపల్లి అప్పారావు, తాటిపాక కృష్ణ స్వాగతం పలికారు. వచ్చే ఎన్నికల్లో 175 అసెంబ్లీ, 25 ఎంపీ స్థానాల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించాలని సత్యదేవుని కోరినట్లు వారు తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తొండంగి: పాయకరావుపేట, హంసవరం విద్యుత్ సబ్‌స్టేషన్లలో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కారణంగా బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో జగ్గంపేట ఈఈ రత్నాలరావు సోమవారం తెలిపారు. ఏవీ నగరం, ఒంటిమామిడి, అన్నయ్యపేట విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని కృష్ణాపురం, ఒంటిమామిడి, పెరుమాళ్లపురం, జీఎం పేట, యల్లయ్యపేట, వేమవరం, ఆనూరు, పైడికొండ, కొత్తపేట, ఏవీ నగరం పరిసర గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

మాదిగలు జగన్‌కు అండగా నిలవాలి

- ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్
- తునిలో ఎన్నికల ప్రచారం



తుని పట్టణంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

తుని: మాదిగలకు సామాజిక న్యాయం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో మాదిగలందరూ అండగా నిలవాలని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ కోరారు. తుని పట్టణంలోని కొండవారిపేట, వీరవరపుపేట, వైఎస్సార్ కాలనీ, ఇసుకలపేట ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర క్యాబినెట్‌లో పలువురు మాదిగలకు మంత్రి పదవులు, వ్యవసాయ కూలీకి ఎంపీ సీటు ఇచ్చారన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో తనకు ఎమ్మెల్సీ పదవిని ఇచ్చారన్నారు. చంద్రబాబునాయుడు మాదిగలకు అన్యాయం చేశారన్నారు. ప్రతిపక్షాల కల్లబొల్లి మాటలను మాదిగలు నమ్మవద్దన్నారు. కాకినాడ ఎంపీగా చలమల శెట్టి సునీల్‌ను, తుని ఎమ్మెల్యేగా మంత్రి దాడిశెట్టి రాజాను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పర్యటిస్తూ వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు ఆరుగుల మోషే, మొర్త రాంబాబు, ప్రేమ్‌కుమార్, ఎం.ఏసురత్నం, తుమ్మలపల్లి జ్యోతి, లక్ష్మి, పద్మ, సింహాచలం, కుమారి, శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వేళ అప్రమత్తంగా ఉండాలి

- అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపండి
- ఫ్లయింగ్ స్క్వాడ్ ఎంసీసీ బృందాల సమావేశంలో ఈఆర్‌ఓ శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసరావు

ప్రత్తిపాడు: ఎన్నికల వేళ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రత్తిపాడు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ. శ్రీనివాసరావు సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఫ్లయింగ్ స్క్వాడ్ (ఎఫ్ఎస్‌టీ), మోడల్ కోడ్ కమిటీ (ఎంసీసీ) బృంద సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎవరైనా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికలకు ముందస్తు ప్రణాళికలు, చర్యలు అవసరమన్నారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఆధారాలు లేకుండా డబ్బు, మద్యం, ఇతర మాదక ద్రవ్యాలు, చీరలు తదితర ఓటర్లను ప్రలోబపెట్టే సామగ్రి తరలింపుపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, ఎంసీసీ బృందాలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి తనిఖీలు చేయాలన్నారు. గ్రామాల్లో రాజకీయ నాయకుల విగ్రహాలుంటే వెంటనే వాటికి ముసుగులు వేయించాలన్నారు. సమావేశంలో ప్రత్తిపాడు సీఐ ఎం.శేఖర్‌బాబు, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి తహసీల్దార్లు ఎస్. నరసింహారావు, వై.రంగారావు, రాజకుమారి, సీహెచ్ విద్యాపతి, ఏలేశ్వరం నగర పంచాయతీ కమిషనర్ కె.శివప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉగాది వేడుకలకు సర్వం సిద్ధం



ప్రత్తిపాడులో వేప పువ్వు సిద్ధం చేస్తున్న మహిళలు

ప్రత్తిపాడు: తెలుగు నూతన సంవత్సర (ఉగాది) వేడుకలకు సర్వం సిద్ధమైంది. తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాల్లోనూ ఆలయాల్లో మంగళవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, పంచాగ శ్రవణాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. గ్రామాల్లోని ఆలయాలను మామిడి, వేప, పత్రులు తదితర పచ్చ తోరణాలతో సుందరంగా అలంకరించారు. షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడిని రుచి చూడని వారు ఉండరు. పులుపు, కారం, చేదు, తీపి, వగరు, ఉప్పు వంటి ఆరు రకాల రుచులతో తయారు చేసే ఉగాది పచ్చడిని మంగళవారం ఆలయాల వద్ద భక్తులకు పంపిణీ చేసేందుకు ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేశాయి. సోమవారం ఉదయం నుంచి గ్రామాల్లో భక్తులు వేపపువ్వు సేకరించే పనిలో పడ్డారు.

ఆలయాల్లో ఉగాది వేడుకలకు ఏర్పాట్లు

తొండంగి: ఉగాదిని పురస్కరించుకుని మంగళవారం దానవాయిపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ మడదా ప్రభాకరరావు తెలిపారు. అలాగే తొండంగి, అద్దరిపేట, పంపాదిపేట, శృంగవృక్షం, బెండపూడి, ఎ.కొత్తపల్లి, పి.ఇ.చిన్నాయపాలెం, పైడికొండ తదితర గ్రామాల్లో ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు, పంచాగ శ్రవణాలకు ఏర్పాట్లు చేశారు.

భక్తులకు వేప పువ్వు పంపిణీ

జగ్గంపేట: ఉగాదిని పురస్కరించుకుని గ్రామానికి చెందిన పాలిక అప్పారావు సోమవారం భక్తులకు వేపపువ్వు, మామిడి తోరణాలు ఉచితంగా పంపిణీ చేశారు. ప్రతిఒక్కరూ ఉగాది పండగను సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆకాక్షించారు.

వైభవంగా కొత్త అమావాస్య వేడుకలు

- ఘనంగా నూకాలమ్మతల్లి తీర్థ మహోత్సవాలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు



ఎస్.అన్నవరంలో అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి దాడిశెట్టి రాజా



ఎస్.అన్నవరంలో నూకాలమ్మతల్లిని దర్శించుకుంటున్న శంకర్ మల్లిక్, నాయకులు



లింగంపర్తిలో నూకాలమ్మను దర్శించుకుంటున్న వరుపుల సూరిబాబు, భక్తులు



కిర్లంపూడి నూకాలమ్మ తీర్థంలో అమ్మకానికి సిద్ధం చేసిన మట్టి బొమ్మలు



తునిలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

ఏలేశ్వరం: మండలంలోని లింగంపర్తి, సిరిపురం గ్రామాల్లో సోమవారం నూకాలమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం వైభవంగా జరిగింది. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తెలవారుజాము నుంచే భక్తులతో ఆలయం కిటకిటలాడింది. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు, వరుపుల సూరిబాబు, వరుపుల రాజబాబు లింగంపర్తిలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

తుని రూరల్: కొత్త అమావాస్యను పురస్కరించుకుని నూకాలమ్మతల్లిని దర్శించేందుకు వచ్చిన భక్తులతో ఆలయాలు కిక్కిరిసిపోయాయి. ఎస్.అన్నవరంలో ఆదివారం రాత్రి జాగరణ నిర్వహించిన నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేయడంతో సోమవారం ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా, అతని తనయుడు శంకర్ మల్లిక్, తుని ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పోతుల లక్ష్మణ్, వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు కీర్తి బాలకృష్ణ, నాయకులు దేవవరపు నాని, వంగలపూడి కృష్ణారావు తదితరులు నూకాలమ్మతల్లిని దర్శించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. మండలంలో రేఖవానిపాలెం, హంసవరం, తేటగుంట, డి.పోలవరం, ఎస్ఎస్‌వి నగరం, తదితర గ్రామాల్లో ఆలయాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించి, మొక్కుబడులు తీర్చుకున్నారు.

రౌతులపూడి: కొత్త అమావాస్యను పురస్కరించుకుని మండలంలోని ఎస్.పైడిపాల, రౌతులపూడి, ఎ.మల్లవరం తదితర గ్రామాల్లో నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శన, తప్పెడగుళ్లు, గరగ నృత్యాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు.

ఘనంగా నూకాలమ్మ, పెద్దింట్లమ్మ జాతర

తొండంగి: కొత్త అమావాస్య సందర్భంగా గ్రామంలో నూకాలమ్మ, పెద్దింట్లమ్మ జాతర మహోత్సవం సోమవారం రాత్రి ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జాతరలో గరగ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

శంఖవరం: మండలంలో మండపం, శంఖవరం, జి.కొత్తపల్లి గ్రామాల్లో సోమవారం నూకాలమ్మ జాతర మహోత్సవాలు ఘనంగా జరిగాయి. గరగ నృత్యాలు, మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ అట్టహాసంగా జాతర నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

కిర్లంపూడి: కొత్త అమావాస్యను పురస్కరించుకుని గ్రామంలో వేంచేసిన నూకాలమ్మ జాతర సోమవారం రాత్రి వైభంగా జరిగింది. మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, పద్మావతి దంపతులు, కుమారుడు గిరిబాబు నూకాలమ్మ అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గరగల నృత్యాలు, విద్యుత్ దీపాలంకరణ, బాణసంచా కాల్పులు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన భారీ హంస వాహనం ఉయ్యాల, డ్రాగన్ జంపింగ్ ట్రిన్సల్‌లో పిల్లలు ఎక్కి కేరింతలు కొట్టారు. స్థానిక, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించి, మొక్కులు తీర్చుకున్నారు.

సత్తెమ్మతల్లి జాతర

జగ్గంపేట: కొత్త అమావాస్య సందర్భంగా మండలంలోని రామవరంలో సత్తెమ్మతల్లి జాతర మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేశారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ

తుని: స్థానిక పాత బజారు వీధిలోని నూకాలమ్మ ఆలయం వద్ద భక్తులకు మజ్జిగ పంపిణీ చేసినట్టు అయోధ్య వాకర్స్ క్లబ్ తుని శాఖ అధ్యక్షుడు మాడుగుల వాసుదేవరావు తెలిపారు. కొత్త అమావాస్యను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని సోమవారం వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ చదరం శివాజీ ప్రారంభించారు. పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు రెండు వేల లీటర్ల మజ్జిగ పంపిణీ చేశారు. వాకర్స్ క్లబ్ జిల్లా కార్యదర్శి కుందెం సత్యనారాయణ, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కుసుమంచి సుబ్బరాయులు, బోడిశెట్టి త్రిమూర్తి స్వామి, పేరూరి కృష్ణ, చక్కా పార్వతి పరమేశ్వర్, బోడిశెట్టి మహేష్, కట్టా శివశంకర్, మలిపెద్ది నాగేశ్వరరావు, పి.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దేవీచౌక్ ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు



గోకవరంలో కనకదుర్గమ్మకు అభిషేకం చేసేందుకు బిందెలతో నీళ్లు తీసుకువచ్చిన భక్తులు

గోకవరం: స్థానిక దేవీచౌక్ ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమావాస్యను పురస్కరించుకుని ఆలయ అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్ శర్మ అమ్మవారికి 108 బిందెల నీళ్లతో అభిషేకాలు చేశారు. అమ్మవారికి అభిషేకించే జలాలను మహిళలు బిందెలతో ఇంటి వద్ద నుంచి తీసుకువచ్చారు. అభిషేకం అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్రోధినామ సంవత్సరంలో ప్రజలు సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షిస్తూ అమ్మవారికి అభిషేకాలు నిర్వహించినట్టు ఆలయ అర్చకులు తెలిపారు. విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన వ్యవస్థాపకుడు కంబాల శ్రీనివాస్‌రావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.